# ఒకటి ఒంటరి అంకె

మల్లాది వెంకట కృష్ణమూర్తి



*1978 లో మల్లాది గారి కలం నుంచీ వెలువడిన నవల*

*(గత సంచిక తరువాయి)*

## 6

"నేను ఎం.ఏ లో చేరుతాను."

ఓ రోజు ఉదయం వంటచేస్తుంటే వర్ధనమ్మతో చెప్పింది త్రిపురం.

వర్ధనమ్మకి తెలుసు త్రిపురం ఇంకా చదువుకోవాలనుకుంటుందని. కూతురినే ముందర ఆ సంగతి కదపనివ్వమని ఊరుకుంది ఆవిడ.

"ఇంకా చదువుతావా?"

"అవును. ఈ రోజులలో గ్రాడ్యుయేట్ అవటంలో ప్రత్యేకత ఏం వుంది? పి.జి. చేస్తే ఓ మాదిరి చదువుకున్నవాళ్ళక్రింద లెక్క."

"మొయ్యలేని బరువు ఎత్తడానికి ప్రయత్నించడం మంచిది కాదు."

"ఎం.ఏ. చదవడం మొయ్యలేని బరువా? ఏ విధంగా? చదవాలనే ఉత్సాహం ఉంది. చదివేశక్తి ఉంది. ఆ మాత్రం ఖర్చు భరించలేనంత బీద స్థితిలో లేం. పైగా స్కాలర్ షిప్ వస్తుంది."

"నీకు ఇరవై వస్తోంది"

"రానీ, ఇరవై వస్తూంటే చదువు ఆపేయాలా?"

"నాకయితే ఇష్టం లేదు."

"ఎందుకు ఇష్టంలేదు? నాన్నగారు పి.హెచ్.డి చేసారు. కాబట్టే ప్రొఫెసర్ అవగలిగారు. వాళ్ళమ్మ నీలా అనివుంటే!"

వర్ధనమ్మ మాట్లాడలేదు.

"అప్లికేషన్ తీసుకొస్తాను రేపు."

"రెండు సంబంధాలు చెప్పారు పిన్నిగారు,"

"పెళ్ళి సంబంధాలా?"

"అవును."

"నేనిప్పుడప్పుడే పెళ్ళి చేసుకోను"

"పెళ్ళి చేసుకుని చదువుకోవచ్చుగా."

"ఊహు. నాకసలు పెళ్ళంటేనే మంట."

వర్ధనమ్మ ఏదో అనబోయింది కాని త్రిపురం ఇంక చర్చ పెంచకుండా వెళ్ళిపోయింది వంటగదిలోంచి.

త్రిపురానికి సీట్ వచ్చింది ఎం.ఏలో, ఉస్మానియా యూనివర్శిటీలోని ఆర్ట్సు కాలేజీలో.

కూతురు నడవడిమీద నమ్మకం ఉంది వర్ధనమ్మకి చిన్నప్పటి నుంచీ ఎలాంటి కట్టడీ చేయలేదు ఆవిడ. కూతురి అభిప్రాయానికి విలువ ఇస్తుంది. తనకి తోచిన సలహాలు ఇస్తుంది. వాటిని తప్పనిసరిగా పాటించాలి అనే ఆంక్ష పెట్టదు.

************

ఒక రోజు శేఖర్ వచ్చాడు.

"హలో బావా కులాసానా?" పలకరించింది త్రిపురం.

"ఎం.ఏ లో చేరావటగా?" అడిగాడు నవ్వుతూ.

"అవును"

కొద్దిసేపు మౌనంగావున్న తర్వాత అడిగాడు.

"నీకు ఇంకా చదవాలని ఉందా?"

"ఉంది."

"బి.ఏ లో అన్నీ డ్రై సబ్జెక్ట్సే."

"నాకు నా సబ్జెక్ట్సు ఇంటరెస్టింగ్ గా ఉండబట్టే చదువుతున్నాను."

చాలాసేపు ఏదో ఆలోచిస్తూ మౌనంగా ఉండిపోయాడు. తర్వాత అడిగాడు. "సూటిగా అడుగుతున్నందుకు ఏం అనుకోకు. నీ పెళ్ళి సెటిల్ చేసుకున్నావా?"

"అంటే?"

"ఎవర్నయినా ప్రేమించావా! అతనికోసం ఎదురు చూస్తున్నావా?" చిన్నగా నవ్వి చెప్పింది త్రిపురం.

"సిల్లీ. అలాంటిదేం లేదు ఇంతదాకా."

"పెళ్ళి చేసుకుని చదువుకోవచ్చుగా!"

"పెళ్ళి అంత ముఖ్యమైంది కాదు నా దృష్టిలో, అయినా చదువుకుని పెళ్ళిచేసుకోవచ్చుగా?"

"నీ పాయింట్ నాకు అర్థంకాలేదు."

"ఏం లేదు ఊరికే అడిగాను."

త్రిపురానికి చూచాయగా అర్థమైంది శేఖర్ పాయింట్.

"ఎవరికి?"

"నాకే. పిల్ల ఇక్కడే ఉంది సైదాబాద్ కాలనీలో. రేపు పెళ్ళి చూపులు."

"వెరీగుడ్ కూడా రావాలా నేను?"

"నీకు అర్థం అయి కానట్లు మాట్లాడుతున్నావా? లేక నా చేతే చెప్పించాలనుకుంటున్నావా?"

"ఏమిటి?"

కొద్దిగా తడబడుతూ అన్నాడు శేఖర్.

"నేను నిన్ను చేసుకోవాలనుకుంటున్నాను." అని ఆగి నవ్వి, "ఏం చేసుకోవాలంటున్నావు? అని మాత్రం అడగకు" అన్నాడు.

త్రిపురం కూడా నవ్వి అన్నది.

"థాంక్స్. కాని అలా అనుకోకు. "

"ఏం?"

"నేనిప్పట్లో వివాహం చేసుకునే ఉద్దేశంలో లేను."

"ఆగమమంటావా?"

"రేపు ఉదయం సైదాబద్ కాలనీ వెళ్ళి ఆ పిల్లని చూడు. రమ్మంటే నేనూ వచ్చి నా అభిప్రాయం చెపుతాను. నచ్చితే ఆ అమ్మాయిని చేసుకో."

"నేనంటే నీకలాంటి అభిప్రాయం లేదా?"

"లేదనుకుంటాను."

శేఖర్ మాట్లాడలేదు.

"బికాంతోనే ఆపేసావు చదువు?"

"బేంక్ లో ఉద్యోగం వచ్చింది గనుక."

శేఖర్ వెంటనే టాపిక్ మార్చాడు. ఆ విషయం మళ్ళీ మాట్లాడలేదు. శేఖర్ వెళ్ళబోయేముందు చెప్పింది త్రిపురం.

"ప్లీజ్ ఫర్ గివ్ మి ఇఫ్ ఐ డిడ్ హార్ట్ యువర్ ఫీలింగ్స్."

"ఇట్సాల్ రైట్." నవ్వాడు.

శేఖర్ రమ్మనలేదు. త్రిపురం అతని వెంట సైదాబాద్ కాలనీ వెళ్ళలేదు. ఆ సంబంధం రెండువైపులవారికీ నచ్చింది.

త్రిపురం ఎం.ఏ ఫైనల్ ఇయర్ మొదటి టర్మ్ లో ఉండగా ఓ రోజు సునీత అకస్మాత్తుగా వచ్చింది.

"ఉత్తరం రాయకుండా వస్తావేమిటే! మేం కౌలు వసూలు చేసుకోవడానికి రేపల్లె వెళ్ళివుంటే?" చివాట్లు పెట్టింది వర్ధనమ్మ.

"నీకు ఒంట్లో బావుండటంలేదటగా?" అడిగింది సునీత.

"అవును. బిపి ఎక్కువైంది. పైగా ఆయాసం. పెద్దతనం వచ్చేసిందిగా."

"త్రిపురం లేదా?"

"కాలేజీకి వెళ్ళింది"

"ఇంకా దానికి చదువెందుకు?"

"వద్దన్నా మనమాట వినదు, దాని సంగతి తెలుసుగా నీకు,"

సునీతలో ఇదివరకటి ఉత్సహం, చురుకుదనం పూర్తిగా నశించాయి. ఎప్పుడూ దిగులుగా ఉంటుంది. ఆరోగ్యం కూడా పూర్తిగా దెబ్బ తిన్నది. బాగా నీరసంగా కనిపిస్తోంది.

రెండురోజుల తర్వాత సునీత త్రిపురంతో అన్నది.

"బయటకి వెళదాం వస్తావా?"

"సినిమాకి తీసుకెళితే వస్తాను"

"పదయితే"

ఇద్దరూ ఆటోలో సినిమాకి వెళ్ళారు. సినిమా అయాక, "టేంక్ బండ్ వైపు వెళదాం" అన్నది సునీత.

"వర్షాకాలంలో టేంక్ బండ్ దేనికి? ఇంటికే పోదాం పద " అన్నది త్రిపురం.

"నీతో చాలా మాట్లాడాలి."

"ఇంటిదగ్గర మాట్లాడుకుందాం."

"అక్కడ కాదు. అమ్మ వింటుంది."

ఆశ్చర్యంగా చూస్తూ అడిగింది త్రిపురం.

"అమ్మ వినకూడని రహస్యం కూడా ఉందా?"

"ఉంది."

త్రిపురం రెండు క్షణాలు ఆలోచించి చెప్పింది.

"అయితే రైల్వే స్టేషన్ కి వెళదాం పద."

"అక్కడికెందుకు?"

"ప్లాట్ ఫాం టిక్కెట్టు కొనుక్కుని వెయిటింగ్ రూముకి వెళదాం. ప్రశాంతంగా మాట్లాడుకోవచ్చు అక్కడ."

"పద, నీ ఇష్టం."

ఆటోలో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ కి చేరుకున్నారు.

వెయిటింగ్ రూంలోకి వెళ్ళి కూర్చున్నారు ఇద్దరూ. ఆ సమయంలో అట్టే రద్దీగా లేదు.

"ఏమిటి చెప్పు" అడిగింది త్రిపురం.

సునీత మాట్లాడాలని ప్రయత్నించి కూడా మాటలకి తడబడటం గుర్తించింది త్రిపురం.

"ఏమిటే అక్కయ్యా? చెప్పు!" అన్నది సునీత చేతిమీద తన చేతిని ఉంచి.

"మన మధ్య ఇక్కడ జరిగే సంభాషణ ఇక్కడే మర్చిపోవాలి నువ్వు. అలా ఒట్టు పెడితేనే చెపుతాను."

"అలాగే. ప్రామిస్. చెప్పు. డబ్బుకేమయినా ఇబ్బందిగా ఉందా? కొంపతీసి పొలం అమ్మి నీవాటా డబ్బు నీకిచ్చేయమంటావా?" నవ్వింది త్రిపురం.

"నేను ఆపరేషన్ చేయించుకున్నానని తెలుసుగా?"

"అవును?"

"పుట్టిన ముగ్గురూ నన్నన్యాయం చేసిపోయారు."

"ఆ విషయాలెందుకు ఇప్పుడూ?"

"మీ బావగారి బాధ చూస్తుంటే నాకే గుండె తరుక్కుపోతోంది. ఆయనకి పిల్లలంటే ఇష్టం. మామూలుగా ఓ కూతురు పుట్టిపోయినా అంతగా బాధపడేవారు కారు. కవలపిల్లలు పుట్టీ, కనీసం వాళ్ళకి పేర్లయినా పెట్టకుండా.."

సునీత బాధతో మాట్లాడలేకపోయింది. కర్చీఫ్‌తో కన్నీళ్ళు తుడుచుకుని చెప్పింది.

"నాకిక పిల్లలు పుట్టే యోగ్యత లేదు. ఆపరేషన్ చేసి గర్భసంచి తీసేసారు"

త్రిపురం మౌనంగా వింటోంది, అక్కయ్య ఏం చెప్పబోతోందో అంతుపట్టలేదు.

ఆయన పిల్లలకోసం తపించిపోతున్నారు.

"దత్తత తీసుకోవచ్చుగా ఎవరినయినా?"

"ఎవరిని? అనాధలనా?"

"ఏం? వాళ్ళు పిల్లలు కారా? వాళ్ళ మొహం మీద 'అనాధలు' అని రాసి ఉండదుగా."

"మన రక్తం పంచుకు పుట్టిన వాళ్ళు కాకపోతే వాళ్ళని దగ్గరకి చేరదీయ బుద్దికాదు."

"అన్నయ్య కొడుకుని దత్తత తీసుకోవచ్చుగా,"

"వాడినా? చస్తే అడగను."

"మరయితే ఎలా?"

"అందుకే బాగా ఆలోచించాను."

"ఆలోచించి?"

సునీత ఓ గుటకవేసి అన్నది.

"ఒకటనుకున్నాను."

"ఏమిటా ఒకటి?"

"బావగారిని మళ్ళీ పెళ్ళిచేసుకోమని అడిగాను."

త్రిపురం నిశ్చేష్టురాలయింది.

"ఏమని అడిగావ్?" అడిగింది,

"పెళ్ళి చేసుకోమని"

"నువు బ్రతికుండగానే?"

"అవును"

"నీకు మతి చెడిందా?"

"లేదు నా పరిస్థితిలో ఉండి ఆలోచిస్తే సబబే నేను కోరింది. బయట నుండి చూసేవారికి అది పిచ్చిగానే కనిపిస్తుంది. ఆయన మానసికంగా కృంగి కృశించిపోవడం నాకెంత మాత్రం ఇష్టంలేదు. గొప్పలు చెప్పుకోవటం కాదు. నిజంగా నేనాయన్ని మనసారా ప్రేమిస్తున్నాను."

"అది చూపించుకునేదారి ఇదా?"

"పూర్తిగా ఇదే"

"నేనేం మాట్లాడలేను."

"నీకూ పెళ్ళయి, భర్తచేత ప్రేమించబడితే అప్పుడే నీకు అర్ధమవుతుంది. ఇవ్వటంలో ఉన్న ఆనందం - ఏదయినా సరే - ప్రేమించే వాళ్ళకి ఏదయినా ఇవ్వాలనిపిస్తుంది వాళ్ళ సంతోషం కోసం"

"నాకు పెళ్ళి కాలేదు. నాకలాంటి ప్రేమ కొత్త. బహుశా నువు చెప్పింది నిజమయే ఉండాలి."

"ఆయన మొదట వద్దన్నారు. తర్వాత అంగీకరించారు"

"దేవుడు ఇలా రాసిపెట్టాడు మీ జీవితాలు."

"అందుకు బాధపడటం తప్ప వేరే ఏం చేయలేం. కేవలం పిల్లల కోసమే ఈ పెళ్ళి. ఆయనకి నేనంటే ఉన్న ప్రేమ పెళ్ళయాక రెండో పెళ్ళాం మీదకు పోతుందన్న భయంలేదు నాకు."

"ఒకవేళ అలా జరిగితే?"

దిగులుగా నవ్వి చెప్పింది సునీత.

"దేముడు అలా రాసిపెట్టివుంటే అది తప్పనిసరి అవుతుంది మనం మార్చలేం."

త్రిపురం మాట్లాడలేదు.

"ఆయన నాకే వదిలేసారు ఈ విషయాలన్నీ. కనీసం కాబోయే పెళ్ళాన్ని ముందర చూసుకోవాలన్న కోరిక కూడా లేదు ఆయనకి. నేను చూసి సరేనంటే చాలు"

"మరీ మంచిది."

"ఒకటే అన్నారు. ఇంకోదాన్ని తీసుకువచ్చి ఇల్లు నరకం చేయకు. నీ చెప్పుచేతల్లో ఉండే అమ్మాయిని చూడు సాధ్యమైనంతవరకు. నీ దగ్గిర దొరకని తృప్తి, ప్రేమ ఇంకొకరి దగ్గర దొరుకుతాయనికాదు ఈ పెళ్ళి. రెండో పెళ్ళివాణ్ణి మొదటి పెళ్ళాం బ్రతికుండగా చేసుకోవాల్సి వచ్చిందని జీవితాంతం ఏడ్చే అమ్మాయి మన కసలువద్దు. దానికి బదులు పిల్లలు అసలు పుట్టలేదనుకుని బ్రతుకుదాం."

"ఎట్లాగయినా బావ మంచివాడు."

"నిజంగానా?"

"కాదా? నీకు తెలియదా?"

"నీకు ఆ నమ్మకం ఉందా?"

"ఉంది. సంబంధం వెదకనా?" నవ్వింది.

"కాదు, నువ్వే"

"ఏమిటి నేనే?"

"నిన్నే ఎన్నుకున్నాను" వణికే కంఠంతో చెప్పింది సునీత.

తెల్లబోతూ చూసింది త్రిపురం.

"నన్ను బావకిచ్చి పెళ్ళిచేస్తావా?" అడిగింది తన కోపాన్ని కంట్రోల్ చేసుకుంటూ.

"అవును. అందుకు నీ అంగీకారం కావాలి" స్థిరంగా అంది సునీత. వెంటనే గట్టిగా ఊపిరి పీల్చుకుంది.

ఇద్దరూ చాలాసేపు మౌనంగా ఉండిపోయారు.

"పోదాం పద" అన్నది త్రిపురం లేస్తూ.

సునీత త్రిపురం చెయ్యి పట్టుకుని లాగి కూర్చోబెట్టి అడిగింది.

"నాకు సమాధానం చెప్పు."

"నో."

"అంటే ఒప్పుకోవా?"

"నెవర్."

సునీత కాసేపు మాట్లాడలేకపోయింది.

"మంచి సంబంధం చూసి పెళ్ళి చెయ్యి. అసలు నా ఉద్దేశంలో నువు అలా చేసి కొత్త సమస్యలు తెచ్చుకుంటున్నావు."

"ఆయన సంగతి నాకు బాగా తెలుసు. ఎన్నేళ్ళ మంచి కాపురం చేస్తున్నాను? ఆలస్యంగా పుట్టి నా పిల్లలు వెళ్ళిపోయారు గాని.."

"ఇంకోసారి ఆలోచించు."

"ఆయన మళ్ళీ పెళ్ళి చేసుకోవటం మాత్రం ఖాయం. కాని ముక్కూ, మొహం తెలియని బయటవారిని ఆయనకిచ్చి చేయటం నా అభిమతం కాదు. నీకూ, వారికీ పిల్లలు పుడితే వాళ్ళని దగ్గర తీయ బుద్ధిఅవుతుంది. ఒకే రక్తం పంచుకుని పుట్టిన వాళ్ళం మనం. నాకు అన్యాయం జరగదన్న ధైర్యం మరి కాస్తవస్తుంది. పైగా నువు నాకన్న ఎక్కువ చదువుకున్నదానివి. బ్రాడ్ మైండెడ్‌గా ఆలోచిస్తావని ఒప్పుకుంటావనే ధైర్యంతో వచ్చాను"

"ఐయామ్ సారీ సునీత, వెరీ సారీ"

"ఆలోచిస్తాను అంటావనుకున్నానుగాని ఇలా మొహం మీదే 'నో' అంటావనుకోలేదు" సునీత కంఠంలో కోపం, దుఃఖం రెండు మిళితమయాయి.

"నీ ఆలోచనే తప్పు అసలు. అందులో నన్ను ఎన్నుకోటం ఇంకో తప్పు."

"ఎందుకు తప్పు? సొంత అక్కని కదా! ఈ మాత్రం చేయలేవా నాకోసం! నీకు నేను గాని, ఆయన గానీ అన్యాయం చేయమని మాట ఇస్తున్నాను. నీ పిల్లలని నా పిల్లలనుకోగలను. ప్రేమగా చూడగలను. కాని పరాయివాళ్ళ పిల్లలు వారికి పుట్టిన వాళ్ళయినా సరే ఆ దృష్టితో చూడలేను."

"నిజానికి నాకిప్పుడు పెళ్ళి చేసుకోవాలని లేదు."

"ఎప్పుడు? జుట్టు తెల్లబడ్డాకా? మేం చచ్చాకా?" ఉద్రేకంగా అడిగింది సునీత.

త్రిపురం సమాధానం చెప్పలేదు వెంటనే. తర్వాత అన్నది నెమ్మదిగా.

"నేను పెళ్ళిచేసుకున్నాక నాకు పుట్టే బిడ్డలలో ఒకరిని మీకు దత్తత ఇస్తాను కావాలంటే. అలా ఒప్పుకునే వారినే పెళ్ళిచేసుకుంటాను సరే?"

"అవసరంలేదు, అంతకంటే వారికి మరెవరి ద్వారానయినా పుట్టే పిల్లలు చాలు మాకు."

"అసలు పిల్లలు కావాలనుకునేది నువ్వా? బావగారా?"

"ఇద్దరం"

"ఇంక నా గురించి అలాంటి ఆశ పెట్టుకోకు. ఇంకెప్పుడూ ఈ ప్రస్తావన నా దగ్గర తేకు"

సునీత లేవబోతున్న త్రిపురం చెయ్యి పట్టుకుని చెప్పింది కఠినంగా.

"నీ నిర్ణయంలో తిరుగులేదా?"

"లేదు."

"అయితే ఇక నువు నాకు చెల్లెలు కాదు"

"నేను నీకు చెల్లెలినే. 'నాకు నువు అక్కయ్య కాదు' అని నువ్వంటే దానికేం చేయలేను."

"ఇక ఈ జన్మలో నీ ఇంట్లో అడుగుపెట్టను."

"ఏమిటా మాటలు?" కోపంగా అన్నది త్రిపురం.

"అవును. నాకు చేయదగ్గ ఉపకారం చేయలేనపుడు నాకు చెల్లెలు ఉండి ఉపయోగమేమిటి?"

"నీది పూర్తిగా సంకుచిత స్వభావం"

"పరిస్థితులు మనిషిని ఎంత సంకుచితంగా నయినా మార్చగలుగుతాయి."

"వాటికి తల ఒగ్గక ఎదిరించి మామూలు మనిషిగా నిలబడగలగటమే గొప్ప."

"ఆ గొప్ప నాకొద్దు. నువే దాచుకో. బావగారికి ఇంకో పెళ్ళి అయిన మరుక్షణం నుంచి నువు నా ఇంటికి రావాల్సిన అవసరంలేదు. వచ్చినా నేను సహించను."

"ఏమిటా మాటలు?"

"మాటలు కాదు. ముందే చెప్పేస్తున్నాను. ఇక నాకళ్ళ బడకూడదు నువు. ఐ హేట్ యు." సునీత గట్టిగా అరిచింది.

వెయిటింగ్ రూంలోని ఒకరిద్దరు వాళ్ళిద్దరి వంక చూసారు వింతగా. "పోదాం పద."

సునీత విసురుగా లేచింది.

ఇద్దరూ బయటకు వచ్చారు. సునీత 'కాఫీ కావాలా' అని కూడా అడగలేదు త్రిపురాన్ని. తన డబ్బులతో కాఫీ తాగి ఫ్లాట్ ఫారంలోంచి బయటకి నడిచింది. ఆటోలో ఇంటికి చేరుకున్నారు. సునీతే ఇచ్చింది ఆటో డబ్బు.

"రేపు ఉదయం వెళ్ళిపోతున్నాను. ఈ సంగతులేం అమ్మకు చెప్పకు. అసలే బి.పి. ఇక నువు ఉన్నంతకాలం ఈ ఇంటికిరాను. కావాలంటే అమ్మనే పిలిపించుకుంటాను చూడాలనుకున్నప్పుడు నువు మాత్రం నా ఇంట్లో ఏనాడు కాలు పెట్టక. నీ పెళ్ళికి మర్యాదకయినా శుభలేక పంపక. నేను రాను. బావసలురాడు."

ఇంట్లోకి వెళ్ళబోయేముందు చెప్పింది సునీత చెల్లెలుతో.

"నీలో మృగం ప్రవేశించింది" అన్నది త్రిపురం కసిగా.

సునీత జవాబు చెప్పలేదు.

మర్నాడు ఉదయం సునీత వెళ్ళిపోయింది. వర్ధనమ్మ వెళ్ళి రైలు ఎక్కించి వచ్చింది. ✷✷✷

*(ఇంకావుంది)*

ఈ నవల క్రిందటి భాగం ఇంకా చదవలేదా..? లేక మళ్ళీ ఒకసారి చదువుదామనుకుంటున్నారా? వెంటనే కౌముది గ్రంథాలయాన్ని సందర్శించండి..




Click here to go to KOUMUDI Library